## విలేఖరులు కావలెను

ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ రాష్ట్రాల వ్యాప్తంగా " శ్రీ ప్రస్థానం దినపత్రికలో " పనిచేయుటకు జిల్లా స్టాఫర్లు, సిసి ఇంచార్జులు, మండల స్థాయి పాత్రికేయులు కావలెను. సమాజంలో జరిగే ప్రతి విషయాన్ని ప్రజల ముంగిటకు తీసుకెళ్లాలనే ఆసక్తి, అనుభవం ఉన్నవారికి ప్రధాన్యత ఉంటుంది.

**పెరుమాళ్ళ వర ప్రసాద్**

సంప్రదించవలసిన నంబర్లు

94916 28386    85220 22029

Land Line No : 08517 224194



RNI Rgd NO : 2020/80757

www.sreeprasthanam.in

# శ్రీ ప్రస్థానం

మన దేశం..మన హక్కు

తెలుగు దినపత్రిక



తెలంగాణ - శ్రీ ప్రస్థానం

Call : 8522022029, 9491628386



కర్నూలు సంపుటి : 04 సంచిక : 08    శనివారం 20-04-2024    పేజీలు :04    వెల:రూ.2.00


# మా ఎమ్మెల్యేలను ముట్టుకో.. మాడి మసైపోతావు: సిఎం రేవంత్



హైదరాబాద్ ,కాంగ్రెస్ అభ్యర్థి వంశీచంద్ రెడ్డి మహబూబ్ నగర్ లో శుక్రవారం నామినేషన్ వేశారు. వంశీచంద్ రెడ్డి నామినేషన్ లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ? ఈ పదేళ్లలో పాలమూరుకు కెసిఆర్ ఏం చేశారు?.. ఏం చేశారని పాలమూరు ప్రజలు బిఆర్ఎస్ కు ఓటేయాలి? అని సిఎం ప్రశ్నించారు. 20 మంది ఎమ్మెల్యేలు టచ్ లో ఉన్నారని కెసిఆర్ అంటున్నారని తెలిపారు. కాంగ్రెస్ హెచ్ టీ వైర్ లా తాను రక్షణగా ఉన్నానని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. మా ఎమ్మెల్యేలను ముట్టుకో.. మాడి మసైపోతావు అని సిఎం వార్నింగ్ ఇచ్చారు.పాలమూరు ప్రజలు కళ్లు తెరిచారు.. గడీల దొరలను నమ్మరని ఆయన వెల్లడించారు. తెలంగాణ కావాలన్న చిన్నారెడ్డిని గత పాలకులు పట్టించుకోలేదని ఆరోపించారు. తాము అధికారంలోకి వచ్చాక చిన్నారెడ్డికి తగిన పదవి ఇచ్చి గౌరవించామన్నారు. మాదిగల వర్గీకరణ సమస్యలను శాశ్వత పరిష్కారం చూపిస్తామని తెలిపారు. మాదిగల వర్గీకరణ కోసం పార్లమెంట్, సుప్రీంకోర్టులో పోరాడదామన్నారు. నేను పాలమూరు బిడ్డను.. ఈ జిల్లా సమస్యలు పరిష్కరిస్తానని పేర్కొన్నారు. పదేళ్లుగా పాలమూరు జిల్లాను ఎడారిగా మార్చారని సిఎం మండిపడ్డారు. 14 లోక్ సభ సీట్లలో కాంగ్రెస్ పార్టీయే గెలవాలని రేవంత్ రెడ్డి తెలిపారు.

# దేశవ్యాప్తంగా తొలిదశ పోలింగ్ ప్రారంభం



న్యూఢిల్లీ,ఏప్రిల్19:దేశంలో తొలివిడత లోక్‌సభ ఎన్నికల పోలింగ్ శుక్రవారం ఉదయం ప్రారంభం అయ్యింది. తొలి విడతలో 21 రాష్ట్రాల్లోని 102 స్థానాలకు పోలింగ్ జరుగుతోంది. అలాగే అరుణాచల్ ప్రదేశ్, సిక్కిం రాష్ట్రాల్లోని అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోలింగ్ కొనసాగుతోంది. ఉదయం నుంచే పెద్ద ఎత్తున ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవడానికి పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చారు. పలువురు నేతలు ఇప్పటికే తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. సీఎం స్టాలిన్, తమిళనాడు సౌత్‌లో తెలంగాణ మాజీ గవర్నర్ తమిళిసై, సేలంలో పళనిస్వామి, కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ మంత్రి పి చిదంబరం శివగంగ పోలింగ్ కేంద్రంలో ఓటు వేశారు. మాజీ ఆర్థిక మంత్రి పన్నీర్ సెల్వం, తమిళనాడు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలైతో పాటు పలువురు ప్రముఖులు ఓటు హక్కును వినియోగించుకుంటున్నారు. సినీ రంగానికి చెందిన ప్రముఖులు కూడా ఓటు వేశారు. రజినీకాంత్, కుష్బూ, కార్తీక్, అజిత్, శివకార్తీకేయన్ ఉదయాన్నే వచ్చి తమ

**భారీగా ఏర్పాట్లు చేసిన ఎన్నికల సంఘం**

**తమిళనాడులో స్టాలిన్ సహా ప్రముఖుల ఓటు**

**రాజస్థాన్‌లో ఓటేసిన సిఎం భజన్‌లాల్ శర్మ**

**మధ్యప్రదేశ్‌లో ఓట్ వేసిన కమల్‌నాథ్**



ఓటు వేశారు. పోలింగ్ పక్రియ సాయంత్రం 6 గంటల వరకు కొనసాగనుంది. సమస్యాత్మక ప్రాంతాల్లో ఓ గంట ముందుగానే పోలింగ్ ముగియనున్నట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. గత ఎన్నికలకు ఈ ఎన్నికలకు చాలా తేడాలు ఉన్నాయి. ప్రస్తుతం తమిళనాడులో త్రిముఖపోరు నెలకొంది. డీఎంకే, ఏడీఎంకే, బీజేపీ కూటముల మధ్య హోరా హోరీ పోరు కొనసాగుతోంది. రాజస్తాన్‌లోనూ పోలింగ్ ప్రశాంతంగా మొదలయ్యింది. ఉదయం 7 గంటలకే పోలింగ్ పక్రియను ప్రారంభించారు ఎన్నికల అధికారులు. ఓటు హక్కు వినియోగించుకోవడానికి ఓటర్లు క్యూ లైన్లలో నిల్చున్నారు. రాజస్తాన్ సీఎం భజనలాల్ శర్మ తనకు కేటాయించిన పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇక మధ్యప్రదేశ్‌లో కూడా లోక్ సభ ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ పర్వం కొనసాగుతోంది. మాజీ సీఎం కమల్‌నాథ్ ఓటు హక్కు వినియోగించుకోగా ఆయన కుమారుడు, కాంగ్రెస్ నేత నకుల్ నాథ్ చింద్వారా లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేస్తున్నారు. చింద్వారాలో పోలింగ్ కొనసాగుతోంది. తీవ్రమైన ఎండల నేపథ్యంలో ఉదయాన్నే వచ్చి ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు ఓటర్లు. దీంతో మధ్యాహ్నం సమయానికే మంచి పోలింగ్ శాతం నెలకొనే అవకాశం ఉన్నట్లు భావిస్తున్నారు.

# 'మా విశ్వాసంపై దాడి'.. రాహుల్, అఖిలేష్‌పై ప్రధాని మోదీ విమర్శలు



లక్నో: ప్రతిపక్ష కూటమిలోని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, ఎస్పీ నేత అఖిలేష్ యాదవ్‌పై ప్రధాని నరేంద్ర మోదీ విమర్శలు గుప్పించారు. మోదీ ఉత్తర ప్రదేశ్‌లోని అమ్రోహా నిర్వహించిన లోక్‌సభ ఎన్నికల ప్రచార ర్యాలీలో శుక్రవారం పాల్గొని మాట్లాడుతూ ప్రతిపక్షాలపై ధ్వజమెత్తారు.'ప్రతి పక్షాలు మా(బీజేపీ) విశ్వాసంపై దాడి చేసి.. బంధు ప్రీతి, అవినీతి, బుజ్జగింపు రాజకీయలు చేస్తున్నాయి. మరోసారి ఉత్తరప్రదేశ్‌లో ఇద్దరు యువరాజులు కొత్త సినిమా తీస్తున్నారు. అయితే ఇప్పటికే వారు తీసిన సినిమాను తిరస్కరించారు. బంధు ప్రీతి, అవినీతి, బుజ్జగింపు రాజకీయలు ముసుగులోనే ప్రతీసారి ప్రతీపక్షాలు ఉత్తరప్రదేశ్ ప్రజలను ఓట్ల అడుగుతారు...ప్రతిపక్ష నాయకులకు మా విశ్వాసంపై దాడి చేస్తున్నారు. కానీ వాటికి మాపై దాడి చేసే అవకాశమే లేదు. ఇక్కడి కాంగ్రెస్ అభ్యర్థి భారత్ మాతాకి జై అనడానికి కూడా ఇబ్బంది పడతాడు. అయోధ్య రామ మందిరంలో రాముడి ప్రాణప్రతిష్ట? కార్యక్రమ ఆహ్వానాన్ని ఎస్పీ, కాంగ్రెస్ పార్టీలు తిరస్కరించాయి. ప్రతి రోజు ప్రతిపక్ష పార్టీలు రాముడిని, సనాతన ధర్మాన్ని దూషిస్తాయి. సమాజ్‌వాదీ పార్టీ నేతలు రాముడి భక్తులను కపటంతో కూడిన వ్యక్తులని బహిరంగా వ్యాఖ్యానిస్తారు' అని ప్రధాని మోదీ మండిపడ్డారు.

# మా కులం వాళ్లను ఇప్పటికీ గుళ్లలోకి అనుమతించడంలేదు: ఖర్గే



న్యూఢిల్లీ: దేశంలో ఇప్పటికీ ఎస్సీలు వివక్షను ఎదుర్కొంటూనే ఉన్నారని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అన్నారు. షెడ్యూల్ కులం, షెడ్యూల్ ట్రయిబ్ అయినందుకు బిజెపి ప్రభుత్వం మాజీ రాష్ట్రపతి రామ్ నాథ్ కొవింద్, ప్రస్తుత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము లను అగౌరపరిచిందన్నారు. రామ మందిర శిలాప్రతిష్ఠాపన ఉత్సవానికి ద్రౌపది ముర్మును ఆహ్వానించలేదు. కొత్త పార్లమెంటు భవన ప్రారంభోత్సవానికి కూడా ఆమెను పిలువలేదు. కాగా కొత్త పార్లమెంటు భవన శంకు స్థాపనకు కూడా కొవింద్ ను అనుమతించలేదన్నారు." ఒకవేళ నేను అయోధ్య విగ్రహ ప్రాణ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి వెళ్లి ఉంటే వారు సహించేవారా?" అని ప్రశ్నించారు. మోడీ తాము 400కు పైగా పార్లమెంటు సీట్లను సాధిస్తామని అనడం అంతా చెత్త. తాను మూడోసారి అధికారంలోకి వస్తానని కలలు కంటున్నారు. కానీ అది సాధ్యం కాదు. ఎందుకంటే ప్రజలు మార్పును కోరుకుంటున్నారని ఖర్గే స్పష్టం చేశారు. వారిని మరో గెలిపించే విషయంలో హెచ్చరికగా ఉండాలని ఆయన ప్రజలను కోరారు. వారు మరోసారి అధికారం చేజిక్కించుకుంటే రాజ్యాంగాన్నే మార్చేస్తారని అన్నారు. ఇప్పటికే వారీ విషయం గురించి మాట్లాడుతున్నారని అన్నారు.రామ మందిరంలోకి ఎవరైనా వెళ్లాలనుకుంటే ఎప్పుడైనా వెళ్లవచ్చు? మోడీ ఏమీ పూజారి కాదు. విగ్రహ ప్రతిష్ఠాపనలో మోడీ అగ్రత్వం ఎందుకు తీసుకున్నాడు? ?అదంతా రాజకీయ ఉద్దేశ్యంతో చేసిందే. ఆలయానికి సంబంధించినంత వరకు మూడింట ఇంకా ఒక వంతు పనులు పూర్తే కాలేదు?అదంతా ఓ రాజకీయ కార్యక్రమమే కానీ ఆధ్యాత్మిక కార్యక్రమం కాదని ఖర్గే వివరించారు.

# కపటనీతికి మారుపేరు కాంగ్రెస్: కెటిఆర్



హైదరాబాద్: రాష్ట్ర ప్రజలు, ముఖ్యంగా యువతకు అరచేతిలో వైకుంఠం చూపించి తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ మండిపడ్డారు. కెటిఆర్ తన ట్విట్టర్ లో కాంగ్రెస్ పై విమర్శలు గుప్పించారు. 120 రోజుల పాలనలోనే కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులతో సహా అందరికీ ద్రోహం చేసిందని, కాంగ్రెస్ అగ్ర నేత ప్రియాంక గాంధీ అధికారంలోకి వచ్చిన వెంటనే నిరుద్యోగులకు రూ. 4,000 నిరుద్యోగ భృతి అందిస్తామని హామీ ఇచ్చారని ఇప్పటి వరకు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. అసలు అటువంటి హామీ ఇవ్వలేదని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట మార్చడం వాళ్లకే సంస్కారానికి వదిలేస్తున్నామన్నారు. ఫిబ్రవరి 1వ తేదీ నుండి ఉద్యోగ నోటిఫికేషన్లు ఇస్తామని కాంగ్రెస్ పార్టీ అన్ని వార్తాపత్రికల మొదటి పేజీలో తమ జాబ్ క్యాలెండర్ గురించి ప్రకటనలు ఇచ్చిందని, వాస్తవానికి బిఆర్ఎస్ హయాంలో భర్తీ చేసిన 30 వేల ఉద్యోగాలకు కేవలం నియామక పత్రాలను ఇచ్చి ఆ ఉద్యోగాలను నిస్సిగ్గుగా కాంగ్రెస్ ఖాతాలో వేసుకుందని చురకలంటించారు.తాము ఇచ్చిన హామీపై నిస్సిగ్గుగా యూ టర్న్ తీసుకుందని, కాంగ్రెస్ ప్రభుత్వం టెట్ పరీక్ష ఫీజును రూ. 400 నుండి రూ. 2000 లకు (2 పేపర్లకు) పెంచిందని, ఎంఎల్ సి బల్మూరి వెంకట్ వంటి కాంగ్రెస్ నాయకులు ఎన్నో కోర్టు కేసులు వేసి అనేక పోటీ పరీక్షలు రద్దవ్వడానికి కారణమయ్యారని విమర్శించారు. నిరుద్యోగుల ఉసురు పోసుకుని, ప్రతిఫలంగా వెంకట్ ఎమ్మెల్సీ పదవిని అందుకున్నాడని, ప్రభుత్వ ఉద్యోగ ఆశావహులను మాత్రం దిక్కుతోచని స్థితిలో కాంగ్రెస్ వదిలేసిందన్నారు. కాంగ్రెస్ అసలు రంగు ఇప్పుడిప్పుడే బయటపడుతోందని, తమని నట్టేట ముంచిన కాంగ్రెస్ పార్టీకి నిరుద్యోగ యువత గుణపాఠం చెప్పాల్సిన సమయం వచ్చిందన్నారు.

# కరీంనగర్‌లో కాంగ్రెస్ అభ్యర్థి గెలవాలి

**ఎంపిలుగా బండి, వినోద్‌లు చేసిందేమీ లేదు**

**కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో మంత్రి పొన్నం**

కరీంనగర్,ఏప్రిల్ 19:కరీంనగర్ పార్లమెంట్ ఎన్నికల్లోకాంగ్రెస్ పార్టీ గెలుపుకు కార్యకర్తలందరూ కష్టపడి పని చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. కరీంనగర్ పార్లమెంట్ సభ్యుడు బండి సంజయ్ నియోజకవర్గ అభివృద్ధికి ఏమైనా చేశాడా?, ఏదైనా



గ్రామంలో తిరిగాడా? అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థికి వాళ్ళ పార్టీ నేతలకు కూడా చెయ్ కలుపరని వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలం పోతారం (ఎస్)లోని శుభం గార్డెన్‌లో హుస్నాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ శ్రేణుల పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశంలో మంత్రి పాల్గొని ప్రసంగించారు. కొత్త రేషన్ కార్డులు రాబోతున్నాయని, వచ్చే ఆగష్టు 15లోపు రైతులకు రెండు లక్షల రూపాయల రుణమాఫీ కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తుందని స్పష్టం చేశారు.

# తెలంగాణలో ఆడవాళ్లు లిక్కర్ దందా చేయరు

**కెసిఆర్ కుటుంబం జైలుకు వెళ్లడం ఖాయం**

**మెదక్ బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్ రావు**

సిద్ధిపేట,ఏప్రిల్ 19:తెలంగాణలో ఆడపిల్లలు లిక్కర్ దందా నడపరని బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితను ఉద్దేశించి మెదక్ బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్ రావు అన్నారు. మరికొద్ది రోజుల్లో కేసీఆర్ ఇంట్లో వాళ్ళు జైలుకు వెళ్లక తప్పదంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ చీఫ్ కేసీఆర్‌పై మెదక్ బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్ రావు కీలక వ్యాఖ్యలు చేశారు.




1985లో కేసీఆర్ మొదటిసారిగా సిద్ధిపేట ఎమ్మెల్యేగా గెలిచినప్పటి నుంచి 39 ఏండ్లుగా సిద్ధిపేటలో కుటుంబ పాలన సాగుతోందని విమర్శించారు. శుక్రవారం నంగునూర్ మండలం కోనాయిపల్లి వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన ఆయన అనంతరం ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... కేసీఆర్ అంటే కాళేశ్వర రావు అంటారు కానీ నంగునూర్ లోని ఒక్క చెరువులో నీళ్ళు లేవని విమర్శించారు. ఎన్నికలు కవితను తీహార్ జైలు నుంచి బయటకు తెచ్చే ఎన్నికలు కావన్నారు. రఘునందన్‌రావు దుబ్బాకలో ఓడిపోవడం ఎంత నిజమో కామారెడ్డిలో కేసీఆర్‌ను బీజేపీ వాళ్లు ఓడించింది అంతే నిజమన్నారు. రూ.1600 కోట్లతో సిద్ధిపేట నుంచి ఎలకతుర్తి వరకు కేంద్ర నిధులతో రోడ్ పనులు నడుస్తున్నాయన్నారు. ఇంకా ఐదేండ్లు ఉచిత రేషన్ బియ్యం అందిస్తామన్నారు. రేవంత్ రెడ్డి గెలిచి నాలుగు నెలలు అయినా రూ.4 వేల పించన్ ఇవ్వలేదన్నారు. రేవంత్ రెడ్డి లంకె బిందెలు ఉన్నాయని అధికారంలోకి వచ్చాడా?.. లేదా ఖాళీ బిందెలు ఉన్నాయని అధికారంలోకి వచ్చాడా? అని వ్యాఖ్యలు చేశారు.

# శ్రీ ప్రస్థానం

సంపాదకీయం

## సవాళ్లుగా మారుతున్న వాతావరణ మార్పులు

వాతావరణ మార్పులతో ఇప్పటికే భూమి అట్టుడుకుతోంది. అకాల వర్షాలు, కరవు పరిస్థితులు అల్లాడిస్తున్నాయి. వాతావరణ మార్పులు ఇప్పుడు భూ ప్రపంచానికి అనేక సవాళ్లను విసురుతున్నాయి. ఇటు భూమి పైన, అటు సముద్రాలపైనా కూడా దీని ప్రభావం పడే అవకాశం ఉంది. ఈ మార్పులు వల్ల వాతావరణంలో వేడిమి పెరిగి ప్రకృతి వైపరీత్యాలు జరిగే ఆస్కారం ఉంది. గ్రీన్హౌస్ వాయువుల వల్ల సమయాభావం లేకుండా కాలక్రమం మారే పరిస్థితి తలెత్తవచ్చు.అటు హిమాలయ పర్వతాలు కూడా కరిగిపోతున్నాయంటే భూతాపం ఎంతగా పెరుగుతోందో అర్థం చేసుకోవచ్చు. హిమాలయాల కారణంగానే ఇండో గంగాటిక్ ఏర్పడ్డాయి. పంజాబ్, హరియాణా, ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, బిహార్, ఝార్ఖండ్, వెస్ట్ బెంగాల్, అసోం రాష్ట్రాలు ఈ మైదానాల్లోనే ఉన్నాయి. అయితే...ఇప్పుడీ ప్రాంతాలన్నింటిపైనా వాతావరణ మార్పుల ప్రభావం పడుతోంది.ఐఐటీ కి చెందిన కొందరు సైంటిస్ట్లు ఈ హెచ్చరికలు చేశారు. ఇండస్, గంగా నదీ పరివాహక ప్రాంతాల్లో త్వరలోనే పరిస్థితులు దారుణంగా మారే ప్రమాదముందని చెబుతున్నారు. విపరీతమైన ఉష్ణోగ్రతలు ఇప్పటికే ఇబ్బంది పెడుతున్నాయని, ఇది పోనుపోను అతి పెద్ద సమస్యగా మారుతుందని అంటున్నారు. అనుకోని కరవు, వడగాలులు, ఉన్నట్టుండి భారీ వర్షాలు, విపరీతమైన ఉష్ణోగ్రతలు...ఇలా ఆ ప్రభావాలు కనిపిస్తాయని వాళ్ల అధ్యయనం చెబుతోంది. జనాభా పెరుగుదల, వాతావరణంలోకి కర్బన ఉద్గారాలు భారీ విడుదలవుతుండడం లాంటి పరిణామాలతో ఇది మరింత సంక్లిష్టంగా మారే అవకాశాలున్నాయి. క్రమంగా ఇండస్-గంగా నదీ మైదానాల్లోని ప్రాంతాలన్నీ హాట్స్పాట్లుగా మారొచ్చని హెచ్చరిస్తున్నారు సైంటిస్ట్లు. ఇప్పటికే ని హాట్స్పాట్గా గుర్తించారు. ప్రపంచంలోనే అత్యధిక జనాభాలో ఉన్న ఈ ప్రాంతంలో ఇలాంటి సవాళ్లు ఎదురైతే కష్టమే అంటున్నారు. ఈ ప్రాంతాల్లో బియ్యం, గోధుమలు ఎక్కువగా పండుతాయి. వాతావరణ మార్పులు తీవ్రమైతే ఈ పంటల దిగుబడిపై ప్రభావం పడే ప్రమాదముంది. అయితే... ఈ సమస్యల్ని ఎదుర్కోడానికి ఎలాంటి చర్యలు తీసుకోవాలో కూడా సైంటిస్ట్లు కొన్ని సూచనలు చేస్తున్నారు. గ్రీన్ హౌస్ ఉద్గారాలు అనేవి సమస్త భూ మండలాన్ని నాశనం చేస్తాయి. ఎందుకంటే ఈ వాయువులు వాతావరణంలో వేడిని పెంచేసి వాతావరణ మార్పులను కారణమవుతున్నాయి. అందుకే ఈ మధ్యకాలంలో సాధారణం కన్నా ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి.ముఖ్యంగా వీటి దెబ్బకు దక్షిణాది రాష్ట్రాల్లో వేడిమి పెరిగి జంతుజీవాలు విలవిలలాడుతున్నాయి. అయితే ఈ వాతావరణంలో విపరీతమైన వేడికి గల కారణాలేంటి? అధిక ఉష్ణోగ్రతలతో వాతావరణంలో మార్పులు ఎలా ఉంటాయి? ఎల్నినో ప్రభావం ఎంతవరకు ఉండొచ్చు? వ్యవసాయ ఉత్పత్తిపై వాతావరణ మార్పుల ప్రభావం ఏ మేరకు ఉంటాయి? అనే అంశాలపై ప్రముఖ వాతావరణ శాస్త్రవేత్త, ముంబయి ఐఐటీ ప్రొఫెసర్ రఘు మాట్లాడారు. కాలాలకు అనుగుణంగా వాతావరణంలో వేడి పెరగడం సాధారణ ప్రక్రియే. మార్చి, ఏప్రిల్, మే మాసాలలో కొన్నిసార్లు జూన్లో అధిక ఉష్ణోగ్రతలు ఉంటాయి. వర్షాకాలం వాటిని చల్లబరుస్తుంది. కానీ సాధారణ కంటే వర్షాలు తక్కువగా కురిసినప్పుడు మాత్రం వాతావరణం వేడిగా ఉంటుంది. ఎడారి ప్రాంతాలు, వెచ్చటి వాతావరణం ఉండే సముద్రాలు, కొన్నిసార్లు స్థానిక పరిస్థితులతో వాటిల్లే మార్పుల ఫలితంగా అధిక ఉష్ణోగ్రతలకు అవకాశాలు ఉంటాయి. దేశంలో పలుచోట్ల ఇప్పుడు అలాంటి పరిస్థితుల్ని చూస్తున్నాం. 10 సంవత్సరాలకు ఓసారి జరిగే వాతావరణ మార్పులు కొన్నిసార్లు మూడు సంవత్సరాలకే వస్తున్నాయి.అధిక ఉష్ణోగ్రతలతో వాతావరణంలో మార్పులు ఎలా ఉంటాయి?: గ్రీన్హౌస్ వాయువులు పెరగడం కూడా వాతావరణ మార్పులకు దారితీస్తుంది. ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. నీటి ఆవిరి అధికం అవుతుంది. వాతావరణంలో తేమ కూడా పెరుగుతుంది. గాలులు సైతం అధిక ఉష్ణోగ్రతలకు కారణం అవుతాయి. మధ్య తూర్పు దేశాల్లో వాతావరణం వేడిగా ఉంటుంది. దాంతో అరేబియా సముద్రం వెచ్చగా ఉంటుంది. ఆ కారణాలతో మనదేశంలోని చాలా ప్రాంతాల్లో వేడి పెరుగుతోంది. అటవీ ప్రాంతాల్లో చెట్లు నరికివేస్తుండటం కూడా ఉష్ణోగ్రతలు పెరగడానికి కారణమే. చెట్లను కాపాడుకోవాలి. పెద్ద సంఖ్యలో మొక్కలను నాటాలిదానివల్లే దేశంలో చాలా ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. హిందూ మహాసముద్రంలో ఇది వేడిని పెంచుతుంది. ఎల్ నినోతో వడగాలులకూ అవకాశం ఉంది. ఈ అంశంపై పూర్తిస్థాయిలో దృష్టి సారించాలి. అధిక ఉష్ణోగ్రతలు, వడగాలుల వంటి వాటిపై యంత్రాంగం ముందస్తు హెచ్చరికలు జారీ చేయాలి. విస్తృత ప్రచారమూ అవసరం. పాఠశాలలు, ఆసుపత్రులు, పంచాయతీలకు ముందే సమాచారం ఇవ్వాలి.సీజన్ల వారీగా వచ్చే వాతావరణ మార్పులు, వడగాలుల హెచ్చరికల గురించి ప్రజలకు అవగాహన కలిగించాలి. వాటిని తెలుసుకొని ప్రజలు చాలా అప్రమత్తంగా ఉండాలి. అధిక ఉష్ణోగ్రతలు, వడగాలుల హెచ్చరికల సమయంలో వృద్ధులను, పిల్లలను బయటకు వెళ్లకుండా చూసుకోవాలి. బహిరంగ ప్రదేశాల్లో పనిచేసేవారు తీవ్ర ఎండల ప్రభావానికి గురికాకుండా జాగ్రత్తపడాలి. వడగాలుల ప్రభావానికి గురైతే ఆసుపత్రికి సకాలంలో చేర్చడం చాలా ముఖ్యం. అందుకు తగిన ఏర్పాట్లు అవసరం. అధిక వర్షాలు లేదంటే వర్షాభావ పరిస్థితులతో పంటల నష్టం జరుగుతుంది.

## ఈవీఎంలు, వీవీ ప్యాట్స్ ను అప్రమత్తంగా తరలించాలి

### జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఈవీఎంలు, వీవీప్యాట్ల పరిశీలన





కరీంనగర్ ఏప్రిల్ 19 :ఫస్ట్ రాండమైజేషన్లో భాగంగా కేటాయించిన ఈవీఎంలు, వీవీ ప్యాట్లను ఆయా నియోజకవర్గాల్లోని స్ట్రాంగ్ రూమ్ లకు అధికారులు అప్రమత్తంగా తరలించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు. శుక్రవారం కరీంనగర్ లోని ఈవీఎం గోదాంను జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా అసెంబ్లీ నియోజకవర్గాలకు ఈవీఎంలు, వీవీ ప్యాట్ల తరలింపు ప్రక్రియను పరిశీలించారు. ఆయా రాజకీయ పార్టీల నాయకులు హాజరయ్యారు. తగిన జాగ్రత్తలు తీసుకుంటూ పకడ్బందీగా వెరిఫై చేయాలని జిల్లా కలెక్టర్ అధికారుల కు సూచించారు. ఎక్కడ ఎలాంటి తప్పిదాలు జరగకుండా చూసుకోవాలని, అప్రమత్తంగా వ్యవహరించాలని పేర్కొన్నారు. తగిన భద్రత మధ్య స్ట్రాంగ్ రూమ్ లకు తరలించాలని తెలిపారు. పలు వివరాలను జిల్లా కలెక్టర్ అధికారులు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, కరీంనగర్ హుజురాబాద్ ఆర్డీవోలు కే మహేశ్వర్, రమేష్ బాబు,


ఆయా రాజకీయ పార్టీల నేతలు సత్యనేని శ్రీనివాస్, మడుపు మోహన్, కళ్యాడపు ఆగయ్య, బర్కత్ అలీ, మిల్కూరీ వాసుదేవ రెడ్డి, తహసీల్దార్లు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## రంగంలో దిగిన అమిత్ షా



హైదరాబాద్, ఏప్రిల్ 19 సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ వచ్చేసింది. ఏప్రిల్ 18 నుంచి 25వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరించనున్నారు. బీజేపీ నుంచి కొందరు ఎంపీ అభ్యర్థులు తొలిరోజే నామినేషన్ వేయబోతున్నారు. తర్వాత ప్రచారం జోరు పెరగనుంది. అన్ని పార్టీలు కూడా ఇక ప్రచార జోరు పెంచేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో సీఎం రేవంత్రెడ్డి తెలంగాణలో మరోసారి బీజేపీ?బీఆర్ఎస్ పొత్తు అంశాన్ని ప్రచారాస్త్రంగా వాడుకోవాలని చూస్తున్నారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో ఈ ప్రచారం కాంగ్రెస్కు బాగా కలిసి వచ్చింది. బీజేపీ?బీఆర్ఎస్ మధ్య రహస్య ఒప్పందం ఉన్నట్లు ప్రజలను నమ్మించడంలో కాంగ్రెస్ సక్సెస్ అయింది. ఫలితంగా బీజేపీకి నాలుగైదు సీట్లు తగ్గాయి. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. బీఆర్ఎస్ ప్రతిపక్షానికి పరిమితమైంది.తెలంగాణలో కాంగ్రెస్ను అధికారంలోకి తెచ్చిన అస్త్రాన్నే మళ్లీ లోక్సభ ఎన్నికల్లో ప్రయోగించాలని సీఎం రేవంత్రెడ్డి చూస్తున్నారు. బీఆర్ఎస్?బీజేపీ మధ్య రహస్య ఒప్పందం కొనసాగుతోందని సీఎం రేవంత్రెడ్డి మరోమారు ఆరోపించారు. ఇందులో భాగంగానే బీఆర్ఎస్ మల్కాజిగిరి, భువనగిరి, జహీరాబాద్, చేవెళ్ల, మహబూబ్నగర్ నియోజకవర్గాల్లో బలహీనమైన అభ్యర్థులను బరిలో దించారని ఆరోపించారు. మరోవైపు ఆ పార్టీ కీలక నేతలు కేసీఆర్, కేటీఆర్, హరీశ్రావులు ఆ నియోజకవర్గాల్లో ప్రచారం కూడా చేయడం లేదని పేర్కొన్నారు. బీజేపీకి పరోక్షంగా సహకరిస్తున్నారని తెలిపారు.ఇక కేసీఆర్ కూతురు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో అరెస్ట్ అయింది. ప్రస్తుతం తిహార్జైల్లో ఉంది. తన కూతురుకు బెయిల్ ఇప్పించుకునేందుకు కేసీఆర బీజేపీతో డీల్ కుదుర్చుకున్నారని కూడా సీఎం రేవంత్రెడ్డి ఆరోపించారు. బీజేపీ, బీఆర్ఎస్ను లోక్సభ ఎన్నిల్లో ఓడించాలని కోరుతున్నారు.ఇదిలా ఉంటే.. సీఎం రేవంత్రెడ్డి చేసిన ఆరోపణలను ఇటు బీజేపీ, అటు బీఆర్ఎస్ ముఖ్యనేతలెవరూ ఖండించకపోవడంతో మరోమారు ఈ ఆరోపణలతో రెండు పార్టీలకు నష్టం జరుగుతుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. పార్టీ కేడర్లోనూ రేవంత్ ఆరోపణలపై ఆందోళన వ్యక్తమవుతోంది. రేవంత్రెడ్డి ఆరోపణల్లో నిజం ఉందా అన్న చర్చ జరుగుతోంది. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇలాంటి ఆరోపణలను తెలంగాణ ప్రజలు విశ్వసించారని, బీజేపీకి తీవ్ర నష్టం చేసిందని ఆ పార్టీ నేతలు అభిప్రాయపడుతున్నారు. రేవంత్రెడ్డి మరోసారి వ్యూహాత్మకంగానే ఈ ఆరోపణలు చేస్తున్నారని కొందమంది పేర్కొంటున్నారు.రేవంత్రెడ్డి ఆరోపణల నేపథ్యం.. గత అనుభవం దృష్ట్యా బీజేపీ నాయకత్వం అలర్ట్ అయింది. లోక్సభ ఎన్నికల వేళ రేవంత్ ఆరోపణలు తిప్పికొట్టేందుకు కేంద్ర హోం మంత్రి అమిత్షా స్వయంగా రంగంలోకి దిగారు. తెలంగాణలో బీజేపీ ప్రచారం తీరుతోపాటు, కాంగ్రెస్, బీఆర్ఎస్ చేస్తున్న తప్పుడుప్రచారాన్ని పరిశీలిస్తున్నారు. స్థానిక నేతలు తాజాగా రేవంత్ చేసిన ఆరోపణలను షా దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్థానిక పరిస్థితులకు అనుగుణంగా అభ్యర్థులకు ఆయన సూచనలు, సలహాలు ఇస్తున్నారు.వచ్చే లోక్సభ ఎన్నికల్లో దేశవ్యాప్తంగా 370 సీట్లు గెలవాలని లక్ష్యంగా పెట్టుకున్న బీజేపీ తెలంగాణలో 10 స్థానాలపై కన్నేసింది. కచ్చితంగా గెలుస్తామని లెక్కలు వేసుకుంటోంది. ఈ క్రమంలో అమిత్షా ప్రత్యేక వ్యూహాలు సిద్ధం చేస్తున్నారు.రేవంత్ఆరోపణల ప్రభావం ఈసారి పెద్దగా ఉండబోదని అంచనా వేస్తున్నారు. బీజేపీపై ప్రజలు నమ్మకంతో ఉన్నారని ఆ నమ్మకాన్ని మరింత పెంచేలా పనిచేయాలని సూచిస్తున్నారు. పార్టీలో చేరికలపైనా దృష్టి పెట్టాలంటున్నారు. మారుతున్న రాజకీయాలపై అప్రమత్తంగా ఉండాలని పేర్కొంటున్నారు. ఈమేరకు ఎప్పటికప్పుడుసూచనలుచేస్తున్నారు.ఇదిలాఉండగా మహబూబ్ నగర్, మెదక్, మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గాలకు చెందిన బీఆర్ఎస్ నేతలు గత పదిరోజులుగా కాంగ్రెస్లో చేరుతున్నారు. ఇందులో గత అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేసిన 9 మంది ఉన్నారు. దీంతో ఈ విషయాన్ని బీజేపీ నేతలు అధిష్టానం దృష్టికి తీసుకెళ్లారు. బీజేపీ నేతలకు కూడా కాంగ్రెస్ గాలం వేస్తుందని తెలిపారు. ఈ క్రమంలో బీజేపీ అధిష్టానం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుంది అన్నది ఆసక్తికరంగా మారింది.

## నిప్పుల కొలిమిలా రాష్ట్రం



### మండుటెండలతో జనం బెంబేలు
### అక్కడక్కడా జల్లులు కురిసినా తగ్గని వేడిమి

హైదరాబాద్,ఏప్రిల్19: తెలంగాణలో భానుడు ఉగ్రరూపం దాలుస్తున్నాడు. ఉదయం 8 గంటల నుంచే వేడి ఎక్కువవుతోంది. అక్కడక్కడా జల్లులు పడ్డా, అకాల వర్షాలతో తాత్కాలిక ఉపశమనం కలిగినా ఎండవేడిమి మాత్రం తగ్గడం లేదు. కొన్నిచోట్ల మబ్బులు పట్టినా వేడిమి తగ్గడం లేదు. రాష్ట్రంలో వడదెబ్బకు గురై పలువురు మృత్యువాత పడ్డారు. రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం రామారావుపల్లిలో మట్కం గంగారాం (42), కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం మొలంగూర్ లో పూదరి కనకయ్య (70), కుమురం భీం జిల్లా కౌటాల మండలం జనగాంలో వేలాది మధుకర్ (24), జోగులాంబ గద్వాల జిల్లా ధరూర్ మండల కేంద్రంలో కావలి వెంకటమ్మ (60), ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం దస్నాపూర్ పంచాయతీ దస్నాపూర్ గూడలో కరాడే విష్ణు (45) వడదెబ్బకు గురై ప్రాణాలు కోల్పోయారు. అలాగే, మహబూబ్ నగర్ జిల్లా కోయిల్ కొండ మండలం నల్లవెల్లి గ్రామానికి చెందిన కావలి నీలకంఠం (32) పిడుగుపాటుతో మృతి చెందారు. అన్ని జిల్లాల్లో 41 నుంచి 44 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదవుతాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ నెల 21న గద్వాల, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, నారాయణపేట, వనపర్తి జిల్లాల్లో.. ఈ నెల 22న ఈ జిల్లాలతో పాటు హైదరాబాద్, కామారెడ్డి, వికారాబాద్, రంగారెడ్డి, సిరిసిల్ల, పెద్దపల్లి, నిజామాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, కరీంనగర్, జగిత్యాల జిల్లాల్లో 40 డిగ్రీల లోపు ఉష్ణోగ్రత నమోదయ్యే అవకాశం ఉందని ఎల్లో అలర్ట్ జారీ చేసింది. 20, 21 తేదీల్లో పలు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని పేర్కొంది. అటు, ఏపీలోనూ వడగాల్పులు తీవ్ర రూపం దాలుస్తున్నాయి. సాధారణం కంటే 3 - 6 డిగ్రీల అధికంగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. రానున్న 2 రోజుల్లో ఉష్ణోగ్రతలు, వడగాల్పులు మరింత తీవ్రం కానున్నాయి. అదే సమయంలో ద్రోణి ప్రభావంతో కొన్ని చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. గురువారం అత్యధికంగా అల్లూరి జిల్లా ఎర్రంపేట, పార్వతీపురం మన్యం జిల్లా కొమరాడల్లో 45.8 డిగ్రీల ఉష్ణోగ్రత రికా÷-దంల్గ÷ంది. శుక్రవారం 91 మండలాల్లో తీవ్ర వడగాల్పులు, 245 మండలాల్లో వడగాల్పులు వీయనున్నాయి. శనివారం 29 మండలాల్లో తీవ్ర వడగాల్పులు, 215 మండలాల్లో వడగాల్పులు వీచే అవకాశాలున్నాయని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ పేర్కొంది. ఇకపోతే 6 జిల్లాల్లో రికార్డు స్థాయిలో 45 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అత్యధికంగా నల్గొండ జిల్లా మాడుగులపల్లి మండలం, మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలాల్లో 45.2 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఏప్రిల్ నెలకు సంబంధించి గత పదేళ్లలో ఇదే అధిక ఉష్ణోగ్రత కావడం గమనార్హం. నల్గొండ, ఆదిలాబాద్ జిల్లాలను మినహాయిస్తే మిగిలిన జిల్లాల్లో ఏప్రిల్ నెలలో 45 డిగ్రీల ఉష్ణోగ్రతలు తాకడం కూడా ఇదే మొదటిసారి. అటు, 5 జిల్లాల్లో 44.9 డిగ్రీలు, 4 జిల్లాల్లో 44.8 డిగ్రీలు నమోదయ్యాయి. సగటున 2 నుంచి 4 డిగ్రీల సెల్సియస్ మేర అధికంగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్న దృష్ట్యా ప్రజలు అల్లాడుతున్నారు. ఇప్పుడే ఇలా ఉంటే మేలో పరిస్థితి ఏంటనే ఆందోళన వ్యక్తం అవుతోంది. గురువారం 6 జిల్లాల్లోని 17 మండలాల్లో వడగాలులు వీచాయి. సూర్యాపేట జిల్లా మఠంపల్లి, పాలకేడు, నూతన్ కల్, మునగాల, నల్గొండ జిల్లా అనుముల హాలియా, నాంపల్లి, తిరుమలగిరి (సాగర్), భద్రాద్రి జిల్లా సుజాతనగర్, కొత్తగూడెం, చంద్రుగొండ, వరంగల్ లోని ఖిల్లా వరంగల్, దూగొండి, చెన్నారావుపేట, సిద్ధిపేట జిల్లాలోని ధూల్ మిట్ట, సిద్ధిపేట పట్టణం, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని చేర్యాల, రేగొండ మండలాల్లో వడగాలులు వీచాయి. వడగాలులు, అధిక ఉష్ణోగ్రతల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని.. వృద్ధులు, చిన్నారులు అవసరమైతేనే బయటకు రావాలని రాష్ట్ర విపత్తు నిర్వహణ విభాగం హెచ్చరించింది. వడదెబ్బకు గురి కాకుండా చర్యలు తీసుకోవాలని సూచించింది.

## రెండవ రోజు 7 నామినేషన్లు




నిజామాబాద్, ఏప్రిల్ 19 : పార్లమెంటు ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో భాగంగా నిజామాబాద్ లోక్ సభ నియోజకవర్గానికి సంబంధించి రెండవ రోజైన శుక్రవారం ఆరుగురు అభ్యర్థులు మొత్తం ఏడు నామినేషన్లు దాఖలు చేశారని రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు తెలిపారు. భారతీయ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) అభ్యర్థిగా బాజిరెడ్డి గోవర్ధన్ రెండు సెట్ల నామినేషన్లు వేశారని అన్నారు. అదేవిధంగా భారతీయ



జనతా పార్టీ (బీజేపీ) అభ్యర్థిగా అరవింద్ ధర్మపురి నామినేషన్ దాఖలు చేశారని తెలిపారు. వీరితో పాటు బహుజన్ ముక్తి పార్టీ అభ్యర్థిగా దేవతి శ్రీనివాస్, స్వతంత్ర అభ్యర్థిగా రాపెల్లి శ్రీనివాస్, ధర్మ సమాజ్ పార్టీ అభ్యర్థిగా కండెల సుమన్, స్వతంత్ర అభ్యర్థిగా రాగి అనిల్ నామినేషన్ పత్రాలు సమర్పించారని రిటర్నింగ్ అధికారి రాజీవ్ గాంధీ హనుమంతు వివరించారు. కాగా, మొదటి, రెండవ రోజున కలుపుకుని ఇప్పటివరకు మొత్తం ఎనిమిది మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారని తెలిపారు.

## రెండో రోజు మూడు నామినేష్లు దా ఖిలు.



జహీరాబాద్ ఏప్రిల్ 19.నామినేషన్ల పర్వం రెండవ రోజైన శుక్రవారం నాడు జహీరాబాద్ పార్లమెంటు నియోజక వర్గానికి మూడు నామినేషన్లు దాఖలు అయ్యాయి.స్వతంత్ర అభ్యర్థులుగా బి.మారుతి రావు, కె.ఆనందీశ్వర్ ఒక్కో సెట్ చొప్పున, రవి మహాదేవ్ స్వామి రెండు సెట్ల చొప్పున నామినేషన్ పత్రాలను సంగారెడ్డి జిల్లా ఎన్నికల అధికారి వల్లూరు క్రాంతి కి అందజేశారు.

## బిజెపితోనే రైతు సంక్షేమం.

### నిజామాబాద్ లోక్ సభ భాజపా అభ్యర్థి ధర్మపురి అరవింద్





నిజామాబాద్ ఏప్రిల్ 19. భాజపతోనే రైతుల సంక్షేమం నిజామాబాద్ లోక్ సభ భాజ పా అభ్యర్థి ఎంపీ ధర్మపురి అరవింద్ అన్నారు. నిజామాబాద్ లోక్ సభ ఎంపీ అభ్యర్థిగా అరవిందు పసుపు రైతులతో కలిసి నామినేషన్ కేంద్రానికి వచ్చి నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా ధర్మపురి అరవింద్ మాట్లాడుతూ పసుపు రైతులు డిపాజిట్ ఫీజు ఇవ్వడం అదృష్టంగా భావిస్తున్నానని అరవిందు అన్నారు. మామిడి చెరుకు వరి పంటలు సాగు చేసే రైతులపై ప్రత్యేక దృష్టి పెడతామని గల్ఫ్ వలసలు ఆపుతామని హామీ ఇచ్చారు. భాజపా అన్ని వర్గాల ప్రజలకు సముచిత న్యాయం చేస్తుందని అన్నారు. రైతులు పండించిన పంటలకు మద్దతు ధర మార్కెటింగ్ సదుపాయాల కోసం కృషి చేస్తానని చెప్పారు. దేశాన్ని ఫుడ్ ప్రాసెసింగ్ హబ్ గా మార్చాలన్నదే బిజెపి సంకల్పమన్నారు. ఆర్మూర్ ను సీడ్ హబ్ గా మారుస్తామని ప్రకటించారు.

## బండి సంజయ్ తరఫున నామినేషన్ దాఖలు

కరీంనగర్ ఏప్రిల్ 19 (:కరీంనగర్ పార్లమెంటు బిజెపి అభ్యర్థి బండి సంజయ్ తరఫున బిజెపి నాయకుడు బండ రమణారెడ్డి శుక్రవారం జిల్లా ఎన్నికల అధికారి,



కలెక్టర్ పమేలా సత్పతికి ఒక సెట్ నామినేషన్ పత్రాలను అందజేశారు. కలెక్టర్ ఛాంబర్ లోని ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో ఆయన అందించారు. రమణారెడ్డి వెంట మాజీ ఎమ్మెల్యే బుడిగే శోభ, బిజెపి నాయకులు గంగాడి కృష్ణారెడ్డి, ప్రతాప రామకృష్ణ, డి శంకర్ పాల్గొన్నారు. పోలీస్ అధికారులు మూడంచెల భద్రత వ్యవస్థను కట్టుదిట్టంగా ఏర్పాటు చేశారు. టౌన్ ఏసిపి నరేందర్ నేతృత్వంలో బందోబస్తు నిర్వహిస్తున్నారు. జిల్లా కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మి కిరణ్, ట్రైనీ కలెక్టర్ అజయ్ యాదవ్, కరీంనగర్, హుజురాబాద్ ఆర్డీవోలు కే మహేశ్వర్, రమేష్ బాబు పలువురు అధికారులు పాల్గొన్నారు.






# అల్లు అర్జున్.. బ్రాండ్ కా బాప్!

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ సినిమా సినిమాకి తన ఇమేజ్, బ్రాండ్ వేల్యూ పెంచుకుంటూ ఐకాన్ హీరోగా దూసుకుపోతున్నాడు. గంగోత్రితో మొదలైన అల్లు అర్జున్ ప్రయాణం పుష్ప సినిమాతో పాన్ ఇండియా స్థాయికి చేరింది. టాలీవుడ్ ఫస్ట్ నేషనల్ అవార్డు విన్నింగ్ హీరోగా అల్లు అర్జున్ ఈ రోజు నిలబడ్డాడు అంటే అందులో అతని కృషి ఎంతో ఉందని చెప్పాలి. సినిమా సినిమాకి అల్లు అర్జున్ యాక్టర్ గా వేరియేషన్స్ చూపిస్తూ నటుడిగా అందరికంటే బెస్ట్ అనిపించుకున్నాడు. పుష్ప సినిమాతో దేశవ్యాప్తంగా ఒక ట్రెండ్ క్రియేట్ చేసిన అల్లు అర్జున్ పుష్ప ది రూల్ మూవీతో బాలీవుడ్ స్టార్స్ అయిన ఖాన్ త్రయాన్ని కూడా బీట్ చేస్తున్నాడు. నార్త్ లో తన మార్కెట్ ని టాప్ లో నిలుపుకున్నాడు అంటే టాలీవుడ్ కి కూడా ఇది గర్వించదగ్గ విషయం. పుష్ప మూవీ హిందీ రిలీజ్ రైట్స్ ఏకంగా 200 కోట్లకి బాలీవుడ్ బడా డిస్ట్రిబ్యూటర్ అనిల్ తడాని కొనుగోలు చేశారు. పాన్ ఇండియా స్టార్ గా ఉన్న ప్రభాస్ సినిమాల బిజినెస్ కూడా ఇప్పటి వరకు ఈ స్థాయిలో జరగలేదని చెప్పాలి. హిందీ థియాట్రికల్ రైట్స్ పరంగా బాలీవుడ్ ఖాన్స్ ని కూడా అల్లు అర్జున్ డామినేషన్ చేసి ఆల్ టైం రికార్డ్ క్రియేట్ చేశాడు. అలాగే పుష్ప ది రూల్ మూవీ డిజిటల్ రైట్స్ ని నెట్ ఫ్లిక్స్ సంస్థ ఏకంగా 250 కోట్లకి కొనుగోలు చేసినట్లు తెలుస్తోంది. ఇండియన్ సిల్వర్ స్క్రీన్ పై ఇదే బిగ్గెస్ట్ డీల్ అని చెప్పాలి. ఇప్పటి వరకు ఏ ఒక్క ఇండియన్ స్టార్ హీరో సినిమాకి కూడా ఈ స్థాయిలో రైట్స్ రాలేదు. ఇది కూడా అల్ టైం రికార్డ్ గా నిలిచింది. ఇండియాలో డిజిటల్ రైట్స్ పరంగా హైయెస్ట్ డీల్ రికార్డ్ గతంలో ఆర్ఆర్ఆర్ సినిమా మీద ఉంది. ఆ చిత్రాన్ని సైతం పుష్ప ది రూల్ తో అల్లు అర్జున్ బీట్ చేశాడు. బన్నీ బ్రాండ్ ఇమేజ్ ఇండియన్ సిల్వర్ స్క్రీన్ ని రూల్ చేస్తున్న స్టార్స్ అందరికంటే ఎక్కువగా ఉందని ట్రేడ్ పండితులు చెబుతున్నారు. ఇప్పటి వరకు ఇండియన్ సిల్వర్ స్క్రీన్ పై సౌత్ నుంచి రాజమౌళి బ్రాండ్ మాత్రమే వినిపించేది. అయితే రాజమౌళితో మూవీ చేయకుండానే అల్లు అర్జున్ సోలోగా బాక్సాఫీస్ ధీరుడిగా అవతరించాడు. అత్యధిక బ్రాండ్ ఇమేజ్ ఉన్న హీరోగా మారాడు. పుష్ప ది రూల్ మూవీకి కేవలం డిజిటల్, హిందీ రైట్స్ ద్వారానే 450 కోట్ల వ్యాపారం జరిగిందని అర్ధమవుతోంది. ఇక తెలుగు రాష్ట్రాలు, ఓవర్సీస్ తో పాటు మిగిలిన సౌత్ స్టేట్స్ కలుపుకొంటే మరో 200 నుంచి 250 కోట్ల వరకు డీల్స్ జరిగే అవకాశం ఉంటుందని ట్రేడ్ పండితులు చెబుతున్నారు. ఈ లెక్కన చూసుకుంటే పుష్ప ది రూల్ మూవీ పై ప్రపంచవ్యాప్తంగా 650 నుంచి 700 కోట్ల బిజినెస్ జరిగే ఛాన్స్ ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఇక బాక్సాఫీస్ వద్ద ఏమాత్రం క్లిక్కయినా పుష్పతో బన్నీ 1000 కోట్ల క్లబ్ లో చేరడం పక్కా.



# మూవీ రివ్యూ : పారిజాత పర్వం




నటీనటులు: చైతన్య రావు-శ్రద్ధా దాస్-సునీల్-హర్ష చెముడు-మాళవిక సతీశన్-శ్రీకాంత్ అయ్యంగార్-సురేఖా వాణి-సమీర్ తదితరులు సంగీతం: రీ ఛాయాగ్రహణం: బాల సరస్వతి నిర్మాతలు: మహిధర్ రెడ్డి-దేవేష్ శ్రీనివాసన్ రచన-దర్శకత్వం: సంతోష్ కంభంపాటి '30 వెడ్స్ 21' వెబ్ సిరీస్ తో మంచి పేరు సంపాదించి.. ఆ తర్వాత 'కీడా కోలా' సహా కొన్ని సినిమాల్లో లీడ్ రోల్స్ చేసిన టాలెంటెడ్ యాక్టర్ చైతన్యరావు ప్రధాన పాత్రలో తెరకెక్కిన కొత్త చిత్రం.. పారిజాత పర్వం. ట్రైలర్ చూస్తే మంచి క్రైమ్ కామెడీలా కనిపించిన ఈ సినిమా ఈ రోజే ప్రేక్షకుల ముందుకు వచ్చింది. దీని విశేషాలేంటో చూద్దాం పదండి. కథ: చైతన్య (చైతన్య రావు) దర్శకుడు కావాలని ఆశపడుతున్న కుర్రాడు. సినిమా హీరో కావాలనుకుని అనుకోకుండా రౌడీగా మారిన బార్ శీను (సునీల్) నిజ జీవిత కథనే స్క్రిప్టుగా మలిచి తన ఫ్రెండు హర్ష (హర్ష చెముడు)నే హీరోగా పెట్టి సినిమా తీయాలని నిర్మాతల చుట్టూ తిరుగుతుంటాడు. కానీ కథ నచ్చినా హర్ష హీరోగా సినిమా చేయడానికి ఏ నిర్మాతా ముందుకు రాడు. ఈ పరిస్థితుల్లో తమ కష్టాలు తీరాలన్నా, తమ కలలు నెరవేరాలన్నా ఒకటే మార్గం అనుకుని శెట్టి (శ్రీకాంత్ అయ్యంగార్) అనే నిర్మాత రెండో భార్య సురేఖ (సురేఖా వాణి)ని కిడ్నాప్ చేయడానికి సిద్ధపడతారు చైతన్య.. హర్ష. ఐతే వాళ్లు శెట్టి ఇంటికి వెళ్లేలోపే ఇంకెవరో సురేఖను కిడ్నాప్ చేస్తారు. వీళ్లు వేరే అమ్మాయిని ఎత్తుకొచ్చేస్తారు. ఆ అమ్మాయి ఎవరు..? ఇంతకీ సురేఖను కిడ్నాప్ చేసిందెవరు..? ఈ చిక్కుముడి నుంచి బయటపడి చైతన్య అనుకున్నది సాధించా?? ఈ ప్రశ్నలన్నంటికీ సమాధానాలు తెర మీదే చూడాలి. కథనం-విశ్లేషణ: క్రైమ్ కామెడీ అనేది ఎవర్ గ్రీన్ జానర్. టాలీవుడ్లో ఈ జానర్లో క్షణక్షణం.. మనీ.. స్వామి రారా.. ఏజెంట్ సాయి శ్రీనివాస ఆత్రేయ లాంటి ఆల్ టైం ఫేవరెట్ సినిమాలు వచ్చాయి. ఐతే ఈ తరహా కథలను డీల్ చేయడం ఒక కళ. పైన చెప్పుకున్న చిత్రాలన్నింటినీ గమనిస్తే.. వాటిలో కథ సీరియస్ గా.. పకడ్బందీగా ఉంటుంది. పాత్రలు సీరియస్ గానే ప్రవర్తిస్తాయి. కామెడీ కోసమని క్యారెక్టర్లు సిల్లీగా ప్రవర్తించవు. తెర మీద వ్యవహారమంతా సీరియస్ గానే సాగుతుంటే చూసే ప్రేక్షకులకు థ్రిల్లింగ్ గా అనిపిస్తుంది. సందర్భోచితంగా హాస్యమూ పండుతుంది. కానీ ఈ మధ్య వస్తున్న క్రైమ్ కామెడీల్లో కథలే మరీ తేలికగా ఉంటున్నాయి. లాజిక్కుల్లేని కథలు.. సిల్లీ క్యారెక్టర్లతో ఈ జానర్ సినిమాలంటే జనాలు లైట్ తీసుకునేలా చేస్తున్నారు ఈ తరం దర్శకులు. తరుణ్ భాస్కర్ లాంటి అభిరుచి ఉన్న దర్శకుడు కూడా 'కీడా కోలా'ను ఇలాగే నడిపించి ప్రేక్షకుల తిరస్కారానికి గురయ్యాడు. ఇప్పుడు సంతోష్ కంభంపాటి అనే కొత్త దర్శకుడు చేసిన 'పారిజాత పర్వం'ను అయితే ప్రేక్షకులు ఏ దశలోనూ సీరియస్ గా తీసుకునే అవకాశమే ఉండదు. అంత సాధారణంగా.. సిల్లీగా సాగిపోతాయి ఇందులోని కథాకథనాలు. హీరో అవ్వాలని హైదరాబాద్ కు వచ్చి ఒక బార్లో వెయిటర్ అయ్యే క్యారెక్టర్ ఒకటి. సినిమాల్లో డ్యాన్సర్ గా వెలిగిపోవాలనుకుని అదే బార్లో డ్యాన్స్ చేస్తుంటుంది ఓ అమ్మాయి. ఆ అమ్మాయికి బార్ యజమాని వల్ల ఇబ్బంది వస్తే అతణ్ని చంపేసి పెద్ద డాన్ అయిపోతాడు ఆ వెయిటర్. ఈ వెయిటర్ కథనే సినిమా స్క్రిప్టుగా మార్చి దర్శకుడిగా ప్రయత్నాలు చేస్తుంటాడు ఇంకో కుర్రాడు. ఈ కథను ఏ నిర్మాతకు చెప్పినా ఆహా అద్భుతం అంటుంటారు. పైగా ఓ నిర్మాత అయితే వెంకటేష్ కు ఈ కథ బాగా సూటవుతుంది నేను ఒప్పిస్తా అంటాడు. ఇలాంటి క్యారెక్టరైజేషన్లతో మొదలైన సినిమాను ప్రేక్షకులు ఏమాత్రం సీరియస్ గా తీసుకుంటాడో అర్థం చేసుకోవచ్చు. ఒక్కటంటే ఒక్కటీ సహజంగా.. లాజికల్ గా అనిపించే పాత్ర కాదు. అసలు నిర్మాతలు పెద్ద హీరోలను పెట్టి సినిమా తీయడానికి రెడీ అవుతుంటే.. తన ఫ్రెండునే పెట్టి సినిమా తీస్తానని హీరో పట్టుబట్టడం ఏంటో అర్థం కాదు. పోనీ ఆ ఫ్రెండు ఏమైనా మంచి నటుడు అనే సంకేతాలు ఇస్తారా.. ప్రేక్షకులకు కూడా అలాంటి ఫీలింగ్ ఏమైనా కలుగుతుందా అంటే అదీ లేదు. ఈ విషయంలో హీరో మొండితనమే చిత్రంగా అనిపిస్తుంటే.. నిర్మాతలు తన ఫ్రెండుని హీరోగా ఒప్పుకోలేదని ఏకంగా కిడ్నాప్ చేసి డబ్బులు సంపాదించి సినిమా ప్రొడ్యూస్ చేయాలనుకోవడం మరీ విడ్డూరం. ఇక కిడ్నాప్ వ్యవహారం అయితే మరీ సిల్లీగా అనిపిస్తుంది. కిడ్నాప్ అంటే ఇంత చిన్న విషయమా అనిపించేలా ఎవరికి వాళ్లు ప్లాన్లు వేసేసి ఎలా పడితే అలా ఎగ్జిక్యూట్ చేసేస్తుంటారు. కిడ్నాప్ అయిన మహిళ భర్తతో వేర్వేరు కిడ్నాప్ గ్యాంగ్స్ సాగించే బేరసారాల గురించి ఎంత తక్కువ చెప్పుకుంటే అంత మంచిది. క్రైమ్ కామెడీలకు కథనంలో వేగం చాలా కీలకమైన విషయం. సన్నివేశాలు పరుగులు పెట్టాలి. కొంచెం హడావుడి ఉండాలి. కానీ 'పారిజాత పర్వం' మాత్రం డల్లుగా.. స్లోగా సాగిపోతుంటుంది. సిల్లీ సీన్లు.. జోకులతో కథనం ప్రేక్షకుల సహనానికి పరీక్ష పెడుతుంది. అక్కడక్కడా హర్ష చెముడు.. శ్రీకాంత్ అయ్యంగార్.. సునీల్.. ఈ ముగ్గురూ కొంచెం నవ్వులు పంచబట్టి సరిపోయింది కానీ.. లేకుంటే సినిమా పూర్తయ్యేదాకా కూర్చోవడం కూడా కష్టమే. ద్వితీయార్థంలో వచ్చే కొన్ని ట్విస్టులు ఓకే అనిపిస్తాయి. కానీ ఇలంటి ట్విస్టులు బోలెడన్ని క్రైమ్ కామెడీల్లో చూశాం. ఈ కథ వినడానికి ఓకే అనిపిస్తుందేమో కానీ.. తెర మీద మాత్రం ఎగ్జిక్యూషన్ తేలిపోయింది. సీరియస్ గా తీసుకోలేని కథ.. పాత్రల వల్ల 'పారిజాత పర్వం' ఏ దశలోనూ ఎంగేజింగ్ గా అనిపించదు. నటీనటులు: చైతన్య రావు పెర్ఫామెన్స్ ఓకే. అతను సినిమాలో ఒక పాత్రధారిలా కనిపిస్తాడు తప్ప హీరోలా ఏమీ లేదు. తన పాత్రే చాలా సాధారణంగా అనిపించడంతో చైతన్యరావు ప్రత్యేకంగా ఏమీ చేయడానికి లేకపోయింది. దీంతో పోలిస్తే 'కీడా కోలా'లో చైతన్య చాలా బెటర్ గా అనిపిస్తాడు. అతడికి జోడీగా నటించిన మాళవిక సతీశన్ చాలా మామూలుగా అనిపిస్తుంది. తనకు చెప్పుకోదగ్గ పాత్రా ఇవ్వలేదు. చాన్నాళ్ల తర్వాత తెలుగు తెరపై మెరిసిన శ్రద్ధా దాస్.. తన గ్లామర్ తో కొంత ఆకట్టుకుంది. బార్ శీను పాత్రలో సునీల్ మెప్పించాడు. ఈ మధ్య అతను కామెడీ చేస్తుంటే ఇబ్బందికరంగా ఉంటోంది. ఈ సినిమాలో పర్వాలేదనిపించాడు. హర్ష చెముడు.. శ్రీకాంత్ అయ్యంగార్ ఈ బోరింగ్ సినిమాలో కొంత రిలీఫ్ ఇచ్చారు. సురేఖావాణి కీలకమైన పాత్రలో రాణించింది. సమీర్.. మిగతా ఆర్టిస్టులు ఓకే. సాంకేతిక వర్గం: 'పారిజాత పర్వం'లో సాంకేతిక హంగులు అంతంతమాత్రమే. రీ సంగీతంలో మెరుపులు లేవు. పాటలకు ప్రాధాన్యం లేని సినిమాలో వచ్చే ఒకట్రెండు పాటలు కూడా మొక్కుబడిగా అనిపిస్తాయి. నేపథ్య సంగీతం క్రైమ్ కామెడీల స్టయిల్లో ఏదో అలా అలా సాగిపోయింది. బాల సరస్వతి ఛాయాగ్రహణం పర్వాలేదు. నిర్మాణ విలువల్లో పరిమితులు కనిపిస్తాయి. రైటర్ కమ్ డైరెక్టర్ సంతోష్ కంభంపాటి ఎంచుకున్న కథలో బేసిక్ ఐడియా బాగుంది. కానీ దాన్ని పకడ్బందీ స్క్రిప్టుగా మార్చలేకపోయాడు. రైటింగ్ దగ్గరే సినిమా తేలిపోయింది.

# కరివేపాకును ఇలా తింటే... రక్తంలో చక్కెర స్థాయి 100% తగ్గుతుంది!

కరివేపాకులను సాధారణంగా దక్షిణ భారత వంటకాల్లో చేర్చి ఆహారం యొక్క రుచి మరియు వాసనను పెంచుతారు. మీ జుట్టు ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడటానికి అన్ని ఆహారాలకు జోడించిన కరివేపాకులను నూనెలో కూడా ఉపయోగించవచ్చు. భారతీయ సాంప్రదాయ వైద్యమైన ఆయుర్వేదంలో కూడా కరివేపాకులను ఎక్కువగా ఉపయోగిస్తారు. బీటా కెరోటిన్ మరియు విటమిన్ సి వంటి యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉన్న కరివేపాకు మన ఆరోగ్యానికి అద్భుతాలు చేస్తుంది. మీ జుట్టును ఆరోగ్యంగా ఉంచుకోవడం నుండి టైప్-2 మధుమేహం మరియు గుండె జబ్బులను నివారించడంలో సహాయపడటం వరకు, ఇది మీకు అనేక రకాల ప్రయోజనాలను అందిస్తుంది. గుండె జబ్బులు, ఇన్ఫెక్షన్లు మరియు వాపు వంటి ఆరోగ్య పరిస్థితులను నిర్వహించడంతో పాటు, మీ రక్తంలో చక్కెర స్థాయిలను నిర్వహించడంలో ఇది సహాయపడుతుందని చెప్పబడింది. కాబట్టి, కరివేపాకు ఆకులను డాక్టర్ సలహా మేరకు మీ ఆహారంలో మధుమేహం నిర్వహణకు ఒక అద్భుతమైన మూలికగా తీసుకోండి. కరివేపాకు రక్తంలోని అధిక చక్కెర స్థాయిలను 45 శాతం తగ్గిస్తుందని ఒక అధ్యయనం సూచిస్తుంది. రక్తంలో గ్లూకోజ్‌ను స్థిరీకరించడంలో సహాయపడటంతో పాటు,




కరివేపాకు మధుమేహం యొక్క సమర్థవంతమైన నిర్వహణలో సహాయపడుతుంది. కరివేపాకులో విటమిన్లు, బీటా కెరోటిన్ మరియు కార్బజోల్ ఆల్కలాయిడ్స్ వంటి యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. అవి ఫ్రీ రాడికల్స్ నుండి ఆక్సీకరణ నష్టంతో సంబంధం ఉన్న అనేక వ్యాధులను నివారిస్తాయి. ఆ జాబితాలో టైప్ 2 మధుమేహం అగ్రస్థానంలో ఉంది. కరివేపాకులో పీచు పదార్థాలు ఎక్కువగా ఉంటాయని చెబుతారు. ఇది జీర్ణక్రియను నెమ్మదిస్తుంది మరియు వేగంగా జీవక్రియలో సహాయపడుతుంది. ఇది మీ శరీర బరువు మరియు రక్తంలో చక్కెరను

అదుపులో ఉంచుతుంది. కరివేపాకు మీ ఇన్సులిన్ చర్యను పెంచుతుంది మరియు శరీరం ఇన్సులిన్‌ను సరిగ్గా ఉపయోగించినప్పుడు, రక్తంలో చక్కెర స్థాయిలు స్థిరంగా ఉంటాయి. మధుమేహం ఉన్నవారిలో స్టార్చ్-టు-గ్లూకోజ్ విచ్ఛిన్నం రేటును తగ్గించే సమ్మేళనాలు ఇందులో ఉన్నాయి. అందువలన, ఇది రక్తంలో గ్లూకోజ్ స్థాయిని నియంత్రిస్తుంది. కాబట్టి మధు మేహ రోగులు ఆహారంలో క రివేపాకులను ఎక్కువగా చేర్చుకోవాలి. కరివేపాకును ఎలా ఉపయోగించాలి? మీరు ఉదయం ఎనిమిది నుండి 10 తాజా కరివేపాకులను నమలవచ్చు లేదా కరివేపాకు రసం తయారు చేసి ప్రతిరోజూ ఉదయం త్రాగవచ్చు. వాటి పూర్తి ప్రయోజనాలను పొందేందుకు వాటిని కూరలు, అన్నం వంటకాలు మరియు సలాడ్‌లకు జోడించం డి. కరివేపాకును క్రమం తప్పకుండా తీసుకునే ముందు వైద్యుడిని సంప్రదించండి. డాక్టర్ సూచించిన విధంగా కరివేపాకులను మీ ఆహారంలో చేర్చుకోండి. ఈ ఆకులు మరియు ఔషధాల యొక్క ఏకకాల వినియోగం రక్తంలో చక్కెర స్థాయిలను గణనీయంగా తగ్గించడంలో సహాయపడ ుతుంది. నిరాకరణ: ఈ కథనంలో అందించిన సమాచారం సాధారణ సమా చారాన్ని మాత్రమే అంది స్తుంది. సరైన సమాచారం కోసం ఎల్లప్పుడూ నిపుణుడిని లేదా మీ స్వంత వైద్యుడిని సంప్రదించండి.

# ఐపీఎల్‌లో రూ. 20 లక్షల అనామకుడు.. కట్ చేస్తే.. 7 సిక్సర్లతో బుమ్రానే సుస్సుపోయించాడు..

ఐపీఎల్ 2024లో మొహాలి వేదికగా ముంబై ఇండియన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో పంజాబ్ యువ బ్యాట్స్‌మెన్ అశుతోష్ శర్మ పవర్ హిట్టింగ్ ఫ్యాన్స్ అందరినీ ఉర్రూతలూగించింది. డెబ్యూ సీజన్ ఆడుతోన్న అశుతోష్ శర్మ.. ముంబై ఇండియన్స్ బౌలర్లను గ్రౌండ్ నలువైపులా చితక్కొట్టాడు. 8వ స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చిన అశుతోష్ శర్మ తన అదిరిపోయే బ్యాటింగ్‌తో ముంబై శిబిరంలో భయభ్రాంతులు సృష్టించారు. కేవలం 23 బంతుల్లోనే హాఫ్ సెంచరీ సాధించిన అశుతోష్.. మొత్తంగా 28 బంతులాడి 61 పరుగులు చేశాడు. ఈ ఇన్నింగ్స్‌లో 7 సిక్సర్లు బాదేశాడు. ప్రతీ మ్యాచ్ మాదిరిగానే అశుతోష్ శర్మ ముంబైతో జరిగిన మ్యాచ్‌లోనూ యథావిధిగా క్రీజులోకి వచ్చిరాగానే బౌలర్లను ఉతికి ఆరేయడం మొదలుపెట్టాడు. 10వ ఓవర్లో జితేష్ శర్మ ఔటైన తర్వాత అశుతోష్ శర్మ క్రీజులోకి వచ్చాడు. ఈ ఆటగాడు తన రెండో బంతికే ఆకాష్ మధ్వల్ వేసిన బంతిని ఫైన్ లెగ్‌లో సిక్స్ కొట్టాడు. దీని తర్వాత ప్రతి ఓవర్‌లో ఒక సిక్స్ లేదా ఫోర్ కొడుతూ వచ్చాడు అశుతోష్. ఇలా కేవలం 23 బంతుల్లోనే అర్ధ సెంచరీ పూర్తి చేశాడు. దాదాపుగా పంజాబ్‌కి విజయాన్ని అందిస్తాడన్న తరుణంలో.. 18వ ఓవర్లో పెవిలియన్‌కు చేరాడు అశుతోష్. పంజాబ్ కింగ్స్ కేవలం రూ. 20 లక్షలకే అశుతోష్ శర్మకు కొనుగోలు చేసింది. అతడికి ఇదే తొలి ఐపీఎల్ సీజన్. ఈ కుడిచేతి వాటం బ్యాటర్ రైల్వేస్ తరపున ఫస్ట్ క్లాస్ క్రికెట్ ఆడాడు. ఈ క్రమంలోనే గతేడాది యువరాజ్ సింగ్ రికార్డును బద్దలు కొట్టాడు. అశుతోష్ కేవలం 11 బంతుల్లో అర్ధ సెంచరీ సాధించిన విషయం తెలిసిందే. ఈ ఘనతతో అతడికి ఎక్కడాలేని పేరు ప్రఖ్యాతలు వచ్చి పడ్డాయి. ఇప్పుడు ఐపీఎల్‌లో కూడా ఈ ఆటగాడు తన తుఫాను హిట్టింగ్‌తో మంచి గుర్తింపు సాధించాడు. ఈ సీజన్‌లో అశుతోష్ 13 సిక్సర్లతో 156 పరుగులు చేశాడు. అతడి స్ట్రైక్ రేట్ 200కిపైగా ఉంది. ఇదే ఫామ్ కొనసాగితే.. మరికొన్ని రోజుల్లో అశుతోష్ టీమిండియా తరపున అరంగేట్రం చేయడం కన్ఫామ్ అని ఫ్యాన్స్ అంటున్నారు.



